మన సమగ్ర
# ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
శనివారం, ఆగస్టు 08, 2026
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే... 5 PM

# డిగ్రీలు మాత్రమే కాదు..
## దేశ స్వప్నాన్నీ
# సాకారం చేయాలి

- మీతో మీకే నిజమైన పోటీ?
- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ మన ప్రజావాణి :** ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఢిల్లీ 57వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ పాల్గొన్నారు. సుమారు 3 వేల మంది కిపైగా విద్యార్థులు ఈ ఈవెంట్‌కు హాజరయ్యారు. దీంట్లో 587 మంది పీహెచ్‌డీ స్కాలర్లు ఉన్నారు. వారికి డిగ్రీ పట్టాలను అందజేశారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ.. పరం ప్రాగ్యా .. హై పర్ఫార్మెన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సూపర్‌కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఐఐటీ ఢిల్లీ సోనిపేట్ క్యాంప్‌లో ఈ సెంటర్‌ను ఆవిష్కరించారు. అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, భారత టెక్నాలజీ రంగంలో ఏఐ ప్రాముఖ్యతను తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీని వీడుతున్న విద్యార్థులకు ఆయన కంగ్రాట్స్ చెప్పారు. విద్యార్థుల కుటుంబాలు, టీచర్లు, మెంటర్లను ఆయన మెచ్చుకున్నారు. డిగ్రీలతోనే కాదు, ఎంతో అనుభవం విద్యార్థులు మిగతా 2లో...

# గొడ్డలి పార్టీ నిరసనల్లో ఒక్కరైనా డీఎస్సీ అభ్యర్థి ఉన్నారా?
## సీఎం చంద్రబాబు



**అమరావతి, ఆగస్టు 08:** ప్రజాస్వామ్య బద్ధంగా నిరసనలు చేసుకునే హక్కు ఎవరికైనా ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజల్ని ఇబ్బంది పెట్టేలా చేసే నిరసనలను ఏమాత్రం ఉపేక్షించబోమని వైసీపీ నేతలను ఆయన హెచ్చరించారు. చట్ట వ్యతిరేకంగా ఏం చేసినా ఉపేక్షించబోమన్నారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ప్రజల్ని ఇబ్బంది పెట్టేలా బస్టాండ్‌లు, రహదారుల వెంట నిరసనలు అంటే ప్రభుత్వం మిగతా 2లో...



## హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర
# బస్సు ప్రమాదం..
## ఏడుగురి మృతి

**చంబా :** హిమాచల్‌ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. తిస్సా-బైరాగఢ్ రహదారిపై చలుజ్ మోర్ సమీపంలో శనివారం ఉదయం ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా, మరో 11 మంది గాయపడ్డారు. మృతుల్లో నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిని తిస్సా సివిల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ సంస్కృతిని చాటిన సెయింట్ మేరీస్ పాఠశాల

- విద్యాలయమే దేవాలయం.
- సాంప్రదాయానికి సన్మానం తోడైంది.
- విద్యతో పాటు సంస్కృతికి పెద్దపీట.
- ములుగు జిల్లాకే ఆదర్శం పసర సెయింట్ మేరీస్ పాఠశాల.
- పండగ అంటేనే బోనాల పండగ.
- కరస్పాండెంట్ స్టీఫెన్ రెడ్డి.



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజావాణి):-** ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పసర గ్రామంలో శుక్రవారం సెయింట్ మేరీస్ హైస్కూల్ పాఠశాల లో కరస్పాండెంట్ స్టీఫెన్ రెడ్డి ఆధ్వర్యంలో పండగ అంటేనే బోనాల పండగ అనేలా పసర గ్రామంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజలతో పాటు విద్యార్థిని విద్యార్థులకు కళ్ళకు కట్టినట్లు కనిపించేలా పండుగ వాతావరణం అందరినీ ఆకట్టుకుంది.

**విద్యార్థులకు పండుగ ప్రాముఖ్యతపై వివరణ**

పాఠశాలలో కార్యక్రమం ఉందని విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ స్టీఫెన్ రెడ్డి మాట్లాడుతూ, పండుగ అంటే ఏమిటి, దాని విశిష్టత ఏమిటో విద్యార్థులకు పూర్తిస్థాయిలో వివరించారు. తెలంగాణ సాంప్రదాయం ప్రకారం బోనాల పండుగ అనేది గ్రామదేవతలకు సంబంధించినది. ఊరిలో ఎలాంటి రోగాలు రాకుండా, ప్రజలకు రక్షణగా ఉండేందుకు అమ్మవార్లను కట్టుదిట్టంగా పూజిస్తారు. ఇది మన సంస్కృతికి, నమ్మకానికి ప్రతీక" అని ఆయన తెలిపారు.








విద్యార్థులు బోనాలు తీసుకుని, పాటలు పాడుతూ, డప్పు చప్పుళ్లతో చేసిన ప్రదర్శన అందరినీ మంత్రముగ్ధులను చేసింది.

**మీడియా మిత్రులచే ప్రిన్సిపాల్ కి సత్కారం**

ఈ కార్యక్రమాన్ని చూసిన మీడియా మిత్రులు ప్రిన్సిపాల్ స్టీఫెన్ రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. ములుగు జిల్లా వార్త కళ్లెం రవీందర్ రెడ్డి, ప్రజావాణి ములుగు జిల్లా గొల్లపెల్లి శ్రీకాంత్ కంచర్ల కృష్ణ ప్రసాద్, కరస్పాండెంట్ ను శాల్వాతో ఘనంగా సత్కరించారు. విద్యతో పాటు సాంప్రదాయాలను కూడా భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మీడియా ప్రతినిధులు పేర్కొన్నారు.

- పొంగులేటి ప్రజాదర్బార్‌లో ఫిర్యాదుతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం
- 309, 310 సర్వే నంబర్లలో క్షేత్రస్థాయి పరిశీలన



## ప్రజాదర్బార్‌తో వెలుగులోకి వెలుతురు
# భద్రమ్మ భూవివాదం...!

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** రెవిన్యూ శాఖ, గృహ నిర్మాణ, సమాచార మంత్రి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో అందిన ఫిర్యాదుతో వెలుతురు భద్రమ్మ భూవివాదం మరోసారి తెరపైకి వచ్చింది. మే 5న మంగళగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో గోళ్లపాడు గ్రామానికి చెందిన వెలుతురు భద్రమ్మ తన భూమికి సంబంధించిన పత్రాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఫిర్యాదులోని అంశాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి విచారణకు శ్రీకారం చుట్టారు. తహసీల్దార్ విజయేంద్రరెడ్డి ఆదేశాల మేరకు ఖమ్మం రూరల్ సర్వేయర్ వినోద్‌కుమార్ శుక్రవారం గోళ్లపాడు గ్రామంలోని 309, 310 సర్వే నంబర్ల వద్దకు వెళ్లి భూమిని పరిశీలించారు. రికార్డుల్లోని వివరాలు, భూమి సరిహద్దులు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను పరిశీలించినట్లు సమాచారం.

**పాత పత్రాల పరిశీలన**

క్షేత్రస్థాయి పరిశీలనలో మిగతా 2లో...



# పాకిస్థాన్‌కు రహస్య సమాచారం చేరవేత..
## ఐఏఎఫ్ అధికారి అరెస్ట్

**హైదరాబాద్ :** పాకిస్థాన్‌కు రహస్య సమాచారం చేరవేస్తున్న వింగ్ కమాండర్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఓ మహిళ సోషల్ మీడియా మిగతా 2లో...



# హైడ్రాలో ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అవమానించారు..

- క్షమాపణ చెప్పాల్సిందే: హరీశ్ రావు



**హైదరాబాద్, ఆగస్టు 8:** హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను అవమానించడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు మిగతా 2లో...

శనివారం ,
ఆగస్టు 08, 2026
మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ


(మొదటి పేజీ తరువాయి)

# డిగ్రీలు మాత్రమే కాదు..

వర్సిటీని వీడుతున్నట్లు ప్రధాని తెలిపారు.ఐఐటీలో చదువుకోవడం వల్ల.. సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించే సామర్థ్యం విద్యార్థులకు వచ్చినట్లు చెప్పారు. దేశానికి సేవ చేయాల్సిన బాధ్యత కూడా ఆ విద్యార్థులపై ఉందని ప్రధాని పేర్కొన్నారు. కోవిడ్19 మహమ్మారి వేళ జరిగిన ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్నానని, ఇప్పుడు భౌతికంగా ఇక్కడకు రావడం సంతో షంగా ఉందన్నారు. సాంకేతిక రంగంలో చాలా విప్లవాత్మక రీతిలో మార్పులు జరుగుతున్నా యని, రాబోయే 20 నుంచి 30 ఏండ్లలో ప్రపం చం మరోలా కనిపిస్తుందన్నారు. టెక్నాలజీ, పరిశ్రమలు, ప్రొఫెషన్స్ ఎప్పుడూ మారుతుంటా యని, కానీ ఎప్పుడూ నేర్చుకోవడమే కీలకమైన అంశంగా మిగులుతుందన్నారు. ఎవరైతే కొత్త విషయాలను నేర్చుకుంటారో, వారే విజేతలుగా నిలుస్తారని ప్రధాని అన్నారు. కొత్తగా ఎదురవు తున్న సవాళ్లను పరిష్కరించే ధైర్యాన్ని విద్యార్థులు ప్రదర్శించాలన్నారు. అవరోధాలను అవకాశాలుగా మార్చుకోవాలన్నారు.
అకాడమిక్ జీవితంతో పాటు క్యాంపస్ బయటి ప్రపంచం గురించి వివరిస్తూ. ఐఐటీ పరీక్షల్లో కచ్చితమైన సిలబస్ ఉంటుందని, కానీ జీవిత మనే పరీక్షలో మాత్రం, అన్నీ సిలబస్‌లో లేని అంశాలే ఉంటాయన్నారు. కానీ ఉత్సుకతతో ఉండాలని ఆయన విద్యార్థులను ఎంకరేజ్ చేశారు. వ్యవస్థీకృత సిద్ధాంతాలను ప్రశ్నిస్తూనే.. వాటికి తగిన పరిష్కారాన్ని కనుగొనే ధైర్యాన్ని కలిగి ఉండాలన్నారు. స్పేస్ టెక్నాలజీ, సెమీక ండక్టర్స్, డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, క్రిటికల్ మినరల్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఎనర్జీ స్టోరేజ్ లాంటి రంగాలు విస్తృతంగా వ్యాపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.దేశంలోని యువత ఆవి ష్కరణల వల్ల స్టార్టప్ వ్యవస్థ, డిజిటల్ ఎకానమీ బలోపేతం అయ్యిందన్నారు. పరిశోధనా రంగం మరో కీలకమైన అంశమన్నారు. ప్రైమ్‌మినిస్టర్స్ రీసర్చ్ ఫెల్లోషిప్, ద రీసెర్చ్, డెవలప్మెంట్ అండ్ ఇన్నోవేషన్ స్కీమ్, అనుసంధాన్ నేషనల్ రీసర్చ్ ఫౌండేషన్ వ్యవస్థలను వాడుకోవాలన్నారు. పరిశోధనా, అధ్యయన వ్యవస్థలను బలోపేతం చేసేందుకు యువ పరిశోధకులు మరింత పట్టు దలతో ఉండాలన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే, విద్యార్థుల కెరీర్ దానిలో భాగస్వామ్యం కావాలన్నారు. కీలక నిర్ణయాలు తీసుకుంటున్న సమయంలో.. జాతీయ ప్రయోజనాల గురించి ఆలోచించాలన్నారు.
జీతాలు, ఉద్యోగాలు, కంపెనీలు, ఘనతల గురి ంచి విద్యార్థులు మిగితా వారితో పోల్చుకోవద్దు అని, ముఖ్యమంగా సోషల్ మీడియాలో ఇలాం టివి చేయకూడదని ప్రధాని మోదీ విద్యార్థులను హెచ్చరించారు. జీవితం అంటే లీడర్‌బోర్డు కాదు అని, మీ పోటీ ఇతర వ్యక్తులతో కాదు అని, మీతో మీరే పోటీపడాలని అన్నారు. స్వంత ప్రగతిపై ఫోకస్ పెట్టాలని, నిరంతరం నేర్చు కోవాలని, జీవితంలో కొత్తది నేర్చుకునేందుకు ఎప్పుడూ ఉత్సుకతతో ఉండాలన్నారు.

## గొడ్డలి పార్టీ నిరసనల్లో ఒక్కరైనా...

ఊరుకోదని వైసీపీ నేతలకు స్పష్టం చేశారు.గొడ్డలి పార్టీ నిరసనల్లో రౌడీలు, గంజాయ్ బ్యాచ్ తప్ప ఒక్కరైనా డీఎస్సీ అభ్యర్థి ఉంటున్నారా? అని సీఎం ప్రశ్నించారు. కర్నూలు నగరంలో ఈ రోజు (శనివారం) కదం తొక్కిన వారంతా మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులేనని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. గొడ్డలి పార్టీ చేసే నష్టం వల్ల.. ఐక్యంగా తమ ఆత్మగౌరవాన్ని డీఎస్సీకి ఎంపికైన ఉపాధ్యాయులంతా చాటారని చెప్పారు.ఈ ఆగస్టు నెలాఖరులోగా రెండు ప్రధాన ప్రాజెక్టులు ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు వివరించారు. వెలుగొండ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి అనకాపల్లి వరకూ ఈ నెలలోనే సాకారమవుతాయని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని వచ్చే ఏడాది విశాఖ వరకూ తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు.అలాగే ఈ నెలలోనే అమరావతికి సంబంధించి రెండు కీలక ప్రాజెక్టులు ప్రారంభవుతాయని సీఎం చంద్రబాబు వివరించారు. సీడ్ యాక్సిస్ రహదారి ప్రారంభంతో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్ కూడా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వర్షాకాలంలోనూ రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాల వల్ల రెండు రోజుల్లో శ్రీశైలం జలశయం నిండే అవకాశం ఉందని పేర్కొన్నారు.లఆ తర్వాత నాగార్జున సాగర్‌కూ నీరు వచ్చే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు వివరించారు. ఆర్థిక వ్యవహారాలపై విడుదల చేసిన శ్వేత పత్రం ప్రజల్లోకి బాగా వెళ్లిందని అన్నారు. ఈ ప్రజెంటేషన్ కోసం 10 గంటలు అధ్యయనం చేశానని ఆయన గుర్తు చేసుకున్నారు. ఇకపై ప్రతీ ఏడాది శ్వేతపత్రం విడుదల చేస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. ఆర్థిక పరిస్థితిని వివరిస్తేనే ప్రజలు అర్థం చేసుకుంటారని సీఎం చంద్రబాబు వివరించారు.

## పాకిస్థాన్‌కు రహస్య సమాచారం చేరవేత..

ద్వారా నిందితుడిని హనీట్రాప్ చేసి, వీడియోకాల్స్ ద్వారా అతనితో మాట్లాడింది. సైనిక కదలికలు, దళాల మోహరింపులకు సంబంధించిన సమాచారం, ఫోటోలు, వీడియోలు, డేటాను అందించమని కోరింది. వింగ్ కమాండర్ డిజిటల్ మాధ్యమాల ద్వారా ఆ డేటాను పంపారు. దీంతో ఐఏఎఫ్ ఇంటెలిజెన్స్ విభాగం సమాచారం మేరకు పోలీసులు అరెస్టు చేశారు.

## హైడ్రాలో ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అవమానించారు..

రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకు ఇంత కక్ష అంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ.. 32 నెలలు దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు.




**హరీశ్ రావు పోస్ట్..** ‘విద్యార్థులు, నిరుద్యోగులు అంటే మీ ప్రభుత్వానికి ఎందుకు ఇంత కక్ష రేవంత్ రెడ్డి? అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్నారు. ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు. ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా? హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా? లేక ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా? ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో ‘క్రిమినల్ వేస్ట్’ అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే ‘యథా రాజా.. తథా అధికారులు’ అన్న సామెత గుర్తుకొస్తోంది. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు?అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. 32 నెలలు దాటింది, ఆ హామీ ఏమైంది?’ అని ప్రశ్నించారు.‘రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా? నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్. నీ జాబ్ క్యాలెండర్ బోగస్. నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోంది. నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడంతో పీజీ, పీహెచ్డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం.. జాబ్స్ ఇవ్వడం లేదు. భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి ఏకంగా విద్యార్థులపైనే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి.. నిరుద్యోగులు మీపై జాలి అడగడం లేదు. మీరు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడుగుతున్నారు. ఉద్యోగం అడగడం నేరం కాదు. ప్రశ్నించడం నేరం కాదు. ప్రభుత్వాన్ని నిలదీయడం నేరం కాదు. ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వం కనీసం ఉద్యోగం కోసం వచ్చిన నిరుద్యోగులను గౌరవించడం నేర్చుకోవాలి. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. వారిని అవమానించినందుకు విద్యార్థి, నిరుద్యోగలోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి’ అంటూ ఎక్స్‌లో హరీశ్ రావు పోస్ట్ చేశారు.

# ప్రజాదర్బార్‌తో వెలుగులోకి వెలుతురు భద్రమ్మ భూవివాదం...!?

(మొదటి పేజీ తరువాయి)



భాగంగా వెలుతురు భద్రమ్మ వద్ద ఉన్న వారసత్వ పత్రాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, భూ హక్కులకు సంబంధించిన ఇతర డాక్యుమెంట్లను అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. అలాగే లంజపల్లి కోటయ్య కుటుంబానికి సంబంధించిన వారసత్వ వివరాలు, 1965లో జరిగిన భూ కొనుగోలుకు సంబంధించిన పత్రాలు, భద్రమ్మ భర్త చిన్న వెంకయ్య కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన ఆధారాలను కూడా పరిశీలించినట్లు సమాచారం. సర్వే సమయంలో లంజపల్లి కుటుంబానికి చెందిన పలువురు అక్కడికి హాజరై తమ వద్ద ఉన్న పత్రాలు, వివరాలను అధికారులకు అందించినట్లు తెలిసింది.

**కుటుంబ సభ్యుల నుంచి వివరాల సేకరణ**

భూవివాదానికి సంబంధం ఉన్న లంజపల్లి కుటుంబ సభ్యులు, పెద్దలను అధికారులు పిలిపించి వారి వద్ద ఉన్న పాత పత్రాలు, భూమి హక్కులకు సంబంధించిన ఆధారాలను పరిశీలించినట్లు సమాచారం. దీంతో ఇంతకాలంగా కుటుంబాల మధ్య కొనసాగుతున్న భూవివాదంపై రెవెన్యూ అధికారులు నేరుగా క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించడం ప్రాధాన్యత సంతరించుకుంది.. గతంలో ప్రజాదర్బార్‌లో భద్రమ్మ చేసిన ఫిర్యాదుతో పాటు, అనంతరం సోషల్ మీడియాలో వెలువడిన వీడియోలు, అందులో వ్యక్తమైన ఆరోపణలపైనా అధికారులు వాస్తవ పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది.

**భద్రమ్మ వారసత్వ హక్కులపై చర్చ**

చిన్న వెంకయ్యకు సంబంధించిన భూమి విషయంలో భార్యగా భద్రమ్మకు ఉన్న హక్కులు, వారసత్వ పరిస్థితులు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. కుమారుడు వెలుతురు గురవయ్య ద్వారా భూమి విక్రయమై ఉంటే, ఆ లావాదేవీలో భద్రమ్మకు ఉన్న హక్కులు ఏమిటన్నది కూడా పరిశీలించాల్సిన అంశంగా మారింది. అయితే ఈ అంశాలపై తుది నిర్ణయం కేవలం కుటుంబ సంబంధాల తన సతీమణి కమలమ్మ ఆధారంగా కాకుండా భూమి స్వభావం, పాత రిజిస్ట్రేషన్ పత్రాలు, లింక్ డాక్యుమెంట్లు, రెవెన్యూ రికార్డులు, వారసత్వ ఆధారాలు, అప్పటి చట్టపరమైన నిబంధనలను పరిశీలించిన అనంతరమే తేలాల్సి ఉంది.

**అసలు భూమి ఎక్కడుంది?**

వివాదంలో ప్రధానంగా అసలు భూమి క్షేత్రస్థాయిలో ఉందా? రికార్డుల్లో నమోదైన విస్తీర్ణం, ప్రస్తుతం ఉన్న భూమి విస్తీర్ణం సరిపోతున్నాయా? భద్రమ్మ వద్ద ఉన్న పత్రాలకు అనుగుణంగా భూమి సరిహద్దులు ఉన్నాయా? అనే అంశాలు కీలకంగా మారాయి. అలాగే ఎస్సీ వర్గానికి చెందిన భూముల కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన ఆరోపణలు, భూమిని పలువురికి పంచినట్లు చూపించారనే ఆరోపణలు తదితర అంశాలు కూడా వివాదంలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. అయితే వీటిలో వాస్తవాలు ఏమిటన్నది అధికారిక రికార్డులు, రెవెన్యూ విచారణ, సర్వే నివేదిక ఆధారంగానే తేలాల్సి ఉంది.

**చిన్న వెంకయ్య నుంచి భూమి ఎవరి చేతుల్లోకి?**

భూవివాదంలో మరో కీలక అంశం చిన్న వెంకయ్య కొనుగోలు చేసిన భూమి అనంతరం ఎవరెవరి పేర్లకు మారిందన్నదే. చిన్న వెంకయ్య నుంచి తదుపరి ఎవరి పేరున రిజిస్ట్రేషన్ జరిగింది? ఆ తర్వాత ఎవరికి విక్రయించారు? ప్రస్తుతం రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డుల్లో భూమి ఎవరి పేరున ఉంది? అనే వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.పాత రిజిస్ట్రేషన్ పత్రాలు, లింక్ డాక్యుమెంట్లు, రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే భూమి కొనుగోలు నుంచి ప్రస్తుత హక్కుదారు వరకు జరిగిన లావాదేవీల క్రమంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**సర్వే నివేదికపై ఆసక్తి**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్‌లో భద్రమ్మ సమర్పించిన ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు స్పందించి 309, 310 సర్వే నంబర్లలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.
ఇప్పుడు సర్వే అనంతరం అధికారులు సమర్పించే నివేదికపై ఆసక్తి నెలకొంది. భూమి హక్కులు, సరిహద్దులు, విస్తీర్ణం, రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, వారసత్వ ఆధారాలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదికలో ఏం తేలుతుందన్నది. ఉత్కంఠగా మారింది. సమగ్ర విచారణ, రికార్డుల పరిశీలన, సర్వే నివేదిక అనంతరమే భూవివాదంపై పూర్తి స్పష్టత వెలుతురు భద్రమ్మకే న్యాయం జరిగే అవకాశం ఉన్నట్లు తెలు స్తోంది.

# బెంగళూరు ఫైవ్ స్టార్ హోటళ్లలో తనిఖీలు.. కిచెన్‌లో కుళ్లిన కూరగాయలు, మాంసం

కర్ణాటక రాజధాని బెంగళూరులోని లగ్జరీ, ఫైవ్ స్టార్ హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టగా దారుణ విషయాలు బయటపడ్డాయి. హోటళ్లలో కుళ్లిన కూరగాయలు, మాంసం, ఎక్స్‌పైరీ అయిన పాలు, ఫంగస్ సోకిన ఆహార పదార్థాలు లభ్యమయ్యాయి. పలు హోటళల్లో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు ఏమీ పాటించట్లేదనే విషయం వెల్లడైంది. అనేక చోట్ల నిబంధనలు ఉల్లంఘించిన పరిస్థితులే ఉన్నాయి. కర్ణాటకకు చెందిన ఫుడ్ సేఫ్టీ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన అధికారులు బెంగళూరు అర్బన్ జిల్లాలోని అనేక స్టార్ హోటళ్లలో తాజాగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి తనిఖీలు నిర్వహించారు.30 టీంలు ఇందుకోసం పని చేస్తున్నాయి. ఈ విషయాన్ని కర్ణాటక ఆరోగ్య శాఖ మంత్రి యూటీ ఖాదర్ కూడా వెల్లడించారు. తాజ్ యెశ్వంత్‌పూర్, షాంగ్రి లా బెంగళూరు వంటి ప్రముఖ త్రీ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్లలో తనిఖీలు చేపట్టారు.
మొత్తం 26 హోటళ్లను తనిఖీ చేయగా, అనేక చోట్ల తీవ్రమైన ఉల్లంఘనలు కనిపించాయి. సాధారణంగా స్టార్ హెటల్స్ అనగానే.. ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు పాటిస్తారు అనుకుంటారు. కానీ, ఇక్కడ చాలా చోట్ల కనీస ప్రమాణాలు పాటించట్లేదని, పాడైన, ఎక్స్‌పైరీ డేట్ దాటిపోయిన కూరగాయలు, మాంసం, పాలు, ఇతర తయారు చేసిన పదార్థాలనే వాడుతున్నట్లు తేలింది. ఈ హోటళ్ల నుంచి చికెన్, మటన్, చేపమాంసం, ఆయిల్, పాలు, మసాలాలు, టీ పౌడర్, చీజ్, సాసెస్ వంటి అనేక పదార్థాల శాంపిల్స్ సేకరించి, వాటిని పరీక్షల కోసం ల్యాబొరేటరీకి పంపించారు. అనేక హోటళ్లలో కిచెన్‌లో పారిశుధ్యం లోపించినట్లు గుర్తించారు. అలాగే, కుళ్లిన కూరగాయల్ని వాడుతున్నారు. ఎప్పుడో తయారు చేసిన ఆహార పదార్థాలు పాడైనప్పటికీ వాటిని మళ్లీ వినియోగిస్తున్నారు.





కొన్నింటికి ఫంగస్ సోకి ఉంది.
ఆహార పదార్థాల నిర్వహణ, భద్రత కూడా సరిగ్గా లేదు. కొన్ని పదార్థాలపై తప్పుడు లేబుల్స్ ఉన్నాయి. అలాగే, శాకాహార, మాంసాహారాన్ని ఒకే చోట కలిపి ఉంచారు. నిబంధనలకు ఇది విరుద్ధం. వెజ్, నాన్‌వెజ్ ఐటమ్స్ వేర్వేరుగా ఉంచాలి. లలిత్ అశోక్ హోటల్ నుంచి 76 కేజీల మాంసం, 200 కేజీల కూరగాయలు, 32 లీటర్ల పాలు పాడైనట్లు గుర్తించి, వాటిని నాశనం చేశారు. వివాంటా బెంగళూరు, షాంగ్రి లా బెంగళూరు, తాజ్ యెశ్వంత్‌పూర్ వంటి ప్రముఖ హోటళ్లలో కూడా కుళ్లిన మాంసం, కూరగాయలు, పాలు, బేకరి ఐటమ్స్ గుర్తించి ధ్వంసం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ఈ హోటళ్ల అన్నింటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు అంటున్నారు.

# డుప్లెక్స్ ఇంట్లో మహిళ అస్థిపంజరం లభ్యం.. మరణించిన ఏడాది తర్వాత వెలుగులోకి

కర్ణాటక రాజధాని బెంగళూరులో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఒక డుప్లెక్స్ ఇంట్లో మహిళ అస్థిపంజరం లభించింది. ఆమె మరణించిన ఏడాది అవుతోందని పోలీసులు తెలిపారు. అయితే, ఇంతకాలం అవుతున్నా.. ఆమె మరణాన్ని ఎవరూ గుర్తించకపోవడం విచారకరం. ఈ ఘటనకు సంబంధించి బెంగళూరు పోలీసులు వెల్లడించిన వివరాలివి. మృతురాలి పేరు దాక్షాయిణి (52). బెంగళూరులోని హవనూర్ లేఔట్‌లోని దాక్షాయిణి సొంత డుప్లెక్స్ ఇంట్లో ఆమె అస్థిపంజరం లభించింది.ఇక్కడ ఆమె ఒంటరిగా ఉండేది. పదేళ్లక్రితం ఆమె భర్త మరణించాడు. ఆ తర్వాత కొంతకాలానికి ఆమె కొడుకు కూడా క్యాన్సర్ కారణంగా మరణించాడు. దీంతో ఆమె తీవ్ర డిప్రెషన్‌లోకి వెళ్లింది. అయితే, ఆమెకు కూతురు ఉంది. దాక్షాయిణికి ఆమె కూతురుతో, అల్లుడుతో విబేధాలున్నాయి. దీంతో వారిద్దరూ ఈమెను పట్టించుకోలేదు. చాలాకాలంగా మాట్లాడలేదు. ఈ క్రమంలో ఒంటరిగా ఉంటున్న దాక్షాయిణి.. అటు భర్త, కొడుకు మరణం.. ఇటు కూతురు పట్టించుకోకపోవడం కారణంగా తీవ్ర డిప్రెషన్‌కు గురైంది. అలాగే, తాను ఫోన్ నెంబర్ కూడా మార్చేసింది. దీంతో ఆమెకు ఇతరులతో సంబంధాలు లేకుండా పోయాయి. తన డుప్లెక్స్ ఇంట్లోనే మరణించింది. ఇది జరిగి ఏడాదవుతోంది. ఇప్పుడు ఆమె అస్థిపంజరం మాత్రమే లభ్యమైంది. చాలాకాలంగా తన తల్లితో సంబంధాలు లేవని, ఆమె తన ఫోన్ నెంబర్ కూడా మార్చేసిందని కూతురు చెబుతోంది.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఆమె మరణానికి సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు. ఫోరెన్సిక్ నిపుణులు ఇంట్లోకి వచ్చి, అస్తిపంజరంతోపాటు ఆధారాలు సేకరించారు.

